


## బాయిలర్ పేలి ముగ్గురికి తీవ్ర గాయాలు

ఓజిలి, జూన్ 10 ప్రభాతవార్త

ఓజిలి మండలం పెద్దపరియ గ్రామ సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు కంపెనీలో శనివారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు బాయిలర్ పేలి ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు, బాయిలర్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించే క్రమంలో అక్కడ పనిచేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన గుర్వబెస్త, రాజేంద్రసింగ్, వికాష్‌వారన్ అనే ముగ్గురు ప్రమాదవశాత్తు బాయిలర్ పేలి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం కంపెనీ సిబ్బంది చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఓజిలి ఎస్ఐ డి.ఆదిలక్ష్మి నెల్‌కాస్ట్ కర్మాగారంలోకి వెళ్లి సమాచారాన్ని సేకరించారు.

## ఘాట్‌లో ప్రమాదాల నివారణకు మహాశాంతిహోమం

### 14న ముహూర్తం ఖరారు



తిరుమల, జూన్ 10(ప్రభాతవార్త)ప్రతినిధి:

తిరుమల నుంచి తిరుపతికి దిగే మొదటి ఘాట్‌లో వరుసగా జరుగుతున్న వాహనాల ప్రమాదాల నివారణకు టిటిడి ఇక మంచి కార్యక్రమానికి పూనుకుంది. ఇందుకోసం ముహూర్తం ఖరారుచేసింది. వరుసగా మొదటి ఘాట్‌లో జరుగుతున్న వాహనాల ప్రమాదాలను నివారించడానికి ఈనెల 14వతేదీ బుధవారం ఉదయం టిటిడి ఆధ్వర్యంలో తిరుపతికి దిగే మొదటిఘాట్‌లోని 7వ మైలువద్ద ప్రసన్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద "మహాశాంతిహోమం"జరిపించనుంది. టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి దేవునిపట్ల ఉన్న విశ్వాసంతో, భక్తులైన యాత్రికుల భద్రత, మానవాళి శ్రేయస్సుకు 14వతేదీ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఈ హోమం నిర్వహించేలా చూస్తారు. రెండు ఘాట్‌రోడ్లలో భక్తుల శ్రేయస్సు,భద్రతకోసం టిటిడి ఈ విశిష్టహోమాన్ని జరిపిస్తోంది. నియంత్రణ లేని వేగంతో ప్రతిరోజూ ప్రమాదాలు వరుసగా జరిగిపోతున్నాయి. దేవ దేవుని దయతో ప్రాణాలు తీసే ప్రమాదం జరగకున్నా ఘాట్‌లో వాహనాలు ఇనుప రైలింగ్‌లను,రక్షణగోడలను ఢీ కొని అదుపుతప్పి బోల్తాపడటం,కాల్వల్లోకి ఒరిగిపోవడం సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో మొదటిఘాట్‌లో రక్షణగోడలు ఎత్తు పెంచడం, క్రాష్‌బారియర్స్ ఏర్పాటు వంటివి చేపట్టడంతోబాటు మహాశాంతిహోమం జరిపించేందుకు సిద్ధమైంది.

## కుంభకోణాలు, ఆరాచకాలకు నెలవు ఆంధ్రప్రదేశ

### బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా



శ్రీకాళహస్తి, జూన్ 10 ప్రభాతవార్త

అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాలనలో భారత దేశంలో ఎక్కడా లేని విధంగా అంధ్రరాష్ట్రంలో అవినీతి కుంభకోణాలకు నిలయంగా మారిందని అరాచకాలకు, ఆక్రమణలకు నెలవుగా ఆంధ్రప్రదేశ్ మారిందని భారతీయ జనతాపార్టీ అధ్యక్షుడు జెపి నడ్డా శివమెత్తారు. శ్రీకాళహస్తిలోని బేరి వారి మండపం వద్ద శనివారం సాయంత్రం 9 సంవత్సరాల పాలనను పూర్తి చేసుకున్న కేంద్ర ప్రభుత్వం సంబరాల సందర్బంగా భారీ ఎత్తున బహిరంగ సభను ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా జెపి నడ్డా రాష్ట్రం గురించి సునిశితంగా విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు రాష్ట్ర నాయకుడు జగన్మోహన్‌రెడ్డి తన స్టిక్కర్లను తగిలించుకొని పబ్బం గడుపుకుంటున్నారన్నారు.రాష్ట్ర రాజధాని అమరావతి అని నరేంద్రమోదీ స్పష్టంగా చెప్పినప్పటికి ఆచరణలో ముఖ్యమంత్రి విధానాలతో రాజధాని లేని రాష్ట్రంగా మారిందన్నారు.'మోస్ట్ కరెప్ట్ స్టేట్ ఆంధ్రప్రదేశ్' అని నడ్డా విమర్శించారు. ఇక్కడ శాంతి భద్రతలు మచ్చుకకు లేదన్నారు. నిధులు మంజూరు చేస్తుంటే రాష్ట్రంలో నిధులు తమ సొంతానికి వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు.

**తిరుపతి అభివృద్దికి చేయూత:**

తిరుపతి జిల్లా అభివృద్దికి ప్రధాన మంత్రి కట్టుబడి ఉన్నారన్నారు. దేశంలోనే ప్రసిద్ది చెందిన పుణ్య క్షేత్రాలు శ్రీకాళహస్తి, తిరుపతి అన్నారు. ఈ రెండు దివ్యక్షేత్రాల అభివృద్దికి ప్రధాన మంత్రి నిధులు అందిస్తున్నారన్నారు. దేశంలోనే అత్యాధునిక సదుపాయాలు కల్గిన రైల్వేస్టేషన్‌గా తిరుపతిని తీర్చి దిద్దుటకు కేంద్ర ప్రభుత్వం రూ.350కోట్లు నిధులు అందించామన్నారు. అలాగే శ్రీకాళహస్తి నియోజకవర్గానికి ఐఐటి, ఐసర్‌లను మంజూరు చేసింది.1491కోట్లు నిధులు మంజూరు చేసామన్నారు.ఇక శ్రీకాళహస్తి ప్రజల చిరకాల కోరిక మేరకు నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే లైన్‌కు కేంద్రం 75శాతం నిధులుమంజూరు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయాల్సిన 25శాతం మంజూరు చేయక నిర్లక్ష్యం చేస్తున్నారని జపి నడ్డా ధ్వజమెత్తారు. ఇక రాయలసీమ అభివృద్దికి కడప రేణిగుంట రోడ్డు, నాయుడుపేట: పూతలపట్టురోడ్లను 6లేన్లు చేస్తున్నామని వివరించారు.రాయలసీమ అభివృద్ది చెందాలంటే ఒక్కసారి ఒక్క అవకాశం బిజెపికి అందించాలని జెపి నడ్డా వివరించారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి సొంతింటి కల సాకారం

### 6 నెలల్లో 32 వేల ఇళ్ళ నిర్మాణాలు- జడ్పీ సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి




చిత్తూరు, జూన్ 10 ప్రభాతవార్త: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో రానున్న ఆరు నెలల్లో 32 వేల ఇళ్ళ నిర్మాణాలు చేపట్టి పూర్తి చేయడానికి కృషి చేయాలని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. జడ్పీ సమావేశభవనంలో జడ్పీ ఛైర్మన్ గోవిం దప్ప శ్రీనివాసులు అధ్యక్షతన శనివారం జడ్పీ సర్వ సభ్య సమావేశం జరిగింది. సమావేశానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డప్ప, కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎమ్మెల్సీలు భరత్, డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంలు, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఆదిమూలంలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అర్హులైన వారికి ఇళ్ళను నిర్మించడంలో సాధించిన ప్రగతితో జిల్లాకు మరిన్ని ఇళ్ళ నిర్మాణాలు మంజూరు అయ్యే అవకాశం వుందన్నారు. ఈ ఆరు నెలల కాలంలో దాదాపు 32 వేల ఇళ్ళ నిర్మాణాలు చేపట్టే పరిస్థితి వుందన్నారు. జిల్లాలో అర్హులైన ఇల్లు లేని వారిని గుర్తించి వారికి ఇళ్ళు నిర్మించి ఇచ్చేలా ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రుల్లో 40 వేల మంది డాక్టర్లు, సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఆసుపత్రులు, పిహెచ్‌సిల్లో డాక్టర్లు, సిబ్బంది కొరత వున్న విషయం తన దృష్టికి తీసుకువస్తే కలెక్టర్ ద్వారా సత్వరం సిబ్బంది నియామకంకు చర్యలు తీసుకొంటామని మంత్రి స్పష్టం చేశారు. గంగవరం మండలం గుండిగల్లు జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ విధులకు సరిగా హాజరు కాకఏపోవడంతో రోజు రోజుకు పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందని జడ్పీటిసీ ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కలెక్టర్ విచారించి నివేదిక ఇవ్వాలని డిఇఒను ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ వైస్ ఛైర్మన్లు భూమిరెడ్డి ధనంజయరెడ్డి, రమ్యలు, జిల్లా వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి, రాష్ట్ర జానపద కళల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొండవీటి నాగభూషణం, రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మర్ మురళీధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మధుబాల, ఎన్ఆర్ఇజిఎస్ స్టేట్ కౌన్సిల్ సభ్యులు విశ్వనాథ్, జడ్పీ సిఇఒ ప్రభాకర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా పరిధిలోని జిల్లా అధికారులు, జడ్పీటిసీలు, ఎంపిపిలు తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా అమ్మణ్ణి సుళ్లు ఉత్సవం

- ముత్యాల చీరలో శ్రీచెంగాళమ్మ





సుళ్లు ఉత్సవం, ముత్యాల చీర అలంకారంలో శ్రీచెంగాళమ్మ

సూళ్లూరుపేట, జూన్ 10 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలో జరుగుతున్న తిరునాళ్లలో భాగంగా మూడోరోజు సాంప్రదాయబద్ధంగా నిర్వహించే సుళ్లు ఉత్సవాన్ని రెండోరోజు అట్టహాసంగా కొనసాగించారు. శనివారం సాయంత్రం 5 గంటలకు సుడిమానుకు పూజలు చేసిన అనంతరం పాలవెల్లికి ముందుగా వడిబాల తర్వాత రోలు, మేకపిల్ల, మనిషి బొమ్మను కట్టి ఒక్కొక్క అంశానికి సంబంధించి మూడు పర్యాయాలు సుడిమాను తిప్పుతూ సుళ్లు ఉత్సవాన్ని కొనసాగించారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆలయ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డిలు సుడిమాను తిప్పుతూ ఉత్సాహంగా వీరజాటీలు చేతబూని చిందులు వేశారు. పంబలోళ్ల దరువులు, గొల్లల వీరతాళ్లు, భారీగా వచ్చిన భక్తుల కిలారింపులు మధ్య సుళ్లు ఉత్సవం బ్రహ్మాండంగా జరిగింది. అమ్మణ్ణి ముత్యాల చీర అలంకారంతో తిరునాళ్లలో భాగంగా మూడోరోజు భక్తులకు దర్శనమిచ్చింది. దేవస్థానం ప్రాంగణంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డి, జెట్టి వేణుయాదవ్, కళత్తూరు శేఖర్‌రెడ్డి, గోగుల తిరుపాల్, మీజూరు రామకృష్ణారెడ్డి, అలవల సురేష్, స్వామిరెడ్డి తదితరులు అమ్మణ్ణి సుళ్లు ఉత్సవంలో పాల్గొని ఉత్సాహంగా చిందులేయడంతో పాటు వీరజాటీలు వేశారు. భక్తజన కోలాహలం ఒకవైపు, మరోవైపు అమ్మణ్ణి పూనిన మహిళాభక్తుల కిలారింపులతో ఉత్సవం కోలాహలంగా జరిగింది.

## ఏ తల్లి కర్కశత్వమో..

### -పసికందును చెత్తకుప్పల్లో వదిలేసిన వైనం !!



కుప్పం, జూన్ 10 ప్రభాతవార్త

అప్పుడే పుట్టిన పురిటి బిడ్డ.. అందునా ఆడపిల్ల మహాలక్ష్మి అని పిలుస్తారు.. అలాంటి కనుగుడ్డులు సైతం సరిగా తెరవని ఓ పసిగుడ్డును ఏ తల్లి కర్కశత్వమో.. లేక ఆడ పిల్ల వద్దనుకుందేమో.. జాతీయ రహదారి పక్కన చెత్తగడ్డిలో ఆ పసిగుడ్డును వదిలేసి వెళ్లిపోయింది.. చిన్నారిని గుర్తించిన స్థానికులు ఆ పసిగుడ్డును అక్కున చేర్చుకున్నారు. ఈసంఘటన రామకుప్పం మండలం చెల్దిగానిపల్లి వద్ద శనివారం చోటు చేసుకుంది. ఓ ముక్కుపచ్చలారని చిన్నారి పసిగుడ్డును ఏ మహాతల్లో జాతీయ రహదారి పక్కన వదిలేసి వెళ్లిపోయి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. విషయంను మాజీ సర్పంచ్ మధుసూధన్‌రెడ్డికి తెలపగా ఆయన చొరవతో ఆ చిన్నారిని తాత్కాలికంగా పిల్లలు లేని వారికి అప్పగించి సంరక్షణ చర్యలు చేపట్టారు. ఏది ఏమైనా ఇంకా సమాజంలో ఆడపిల్ల పుట్టిందనే వివక్ష చూపుతుండడం మానవజాతికే మచ్చగా మిగిలిపోతోంది.




# ప్రజాసమస్యల పరిష్కారానికే గడపగడపకు

**- ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్**

కుప్పం(రామకుప్పం) జూన్ 10 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారానికే గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. శనివారం రామకుప్పం శివాజీ నగర్‌లో గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించి ప్రజలకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేసిన ఘనత



సిఎం జగనన్నకే దక్కుతుందన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అర్హులకు అందిస్తామన్నారు. అంతకుముందు ఎమ్మెల్సీ భరత్‌కు మహిళలు మంగళహారతులు పట్టారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బాబురెడ్డి, ఎంపిపి సుబ్రమణ్యం, కో కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ బివి మురళి, నేతలు అప్పి, అబ్దుల్, యశ్వంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వరసిద్ధుని సన్నిధిలో అనకాపల్లి ఎంపీ

కాణిపాకం, జూన్ 10 ప్రభాతవార్త:



అనకాపల్లి ఎంపీ సత్యవతి శనివారం కుటుంబ సమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ ఎ.వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- ఎమ్మెల్యే వెంకటేగౌడ**

పెద్దపంజాణి, జూన్ 10 ప్రభాతవార్త



పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వెంకటేగౌడ పేర్కొన్నారు. శనివారం పెద్దకాప్పల్లి పంచాయతీ బందార్లపల్లి, జిట్టంవారిపల్లి, గౌరినగర్, ఆకులవారిపల్లి, బేరుపల్లి గ్రామాల్లో ఆయన గడపగడపకు కార్యక్రమంలో భాగంగా 480 గృహాలను సందర్శించారు. నవరత్నాలు పథకాలతో పేదల జీవితాలు బాగుపడ్డాయన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకే సంక్షేమ పథకాల నగదు జమ చేస్తున్న ఘనత సిఎం జగనన్నదేనన్నారు. అర్హులు ఎవరైనా ఉంటే వారికి తప్పక పథకాల్లో లబ్దికలిగిస్తామన్నారు. ప్రతి ఇంటికి ఏదో ఓ పథకంలో లబ్ది కలుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రెడ్డెప్ప, మండల కన్వీనర్ బాగారెడ్డి, వైస్‌ఎంపిపిలు బాబు, అంజమ్మ, సింగిల్‌విండో ఛైర్మన్ బాబురెడ్డి, నేతలుతమ్మిరెడ్డి, రాజారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ చంద్ర, ఎంపిటిసి పావని, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలి

**- ఎంపిపి అశ్విని - పదవ తరగతి విద్యార్థులకు పురస్కారాలు !!**

కుప్పంరూరల్, జూన్ 10 ప్రభాతవార్త



విద్యార్థులు విద్యలో బాగా రాణించి ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలని ఎంపిపి అశ్విని మురుగేష్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ సూచించారు. శనివారం స్థానిక మండల కార్యాలయంలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో ఇంటర్‌నుంచి కీలకదశ మొదలవుతుందని ఈ దశనుంచే జీవితంలో స్థిరపడే విధంగా ఆలోచనలు సాగించి అందుకు తగిన కోర్సుల పట్ల మక్కువ చూపాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు చదువులో రాణించాలన్నారు. ఈసందర్భంగా ఎంపిపి అశ్విని జన్మదినం కావడంతో కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచారు. కార్యక్రమంలో ఎంపిడిఓ జానకమ్మ, ఎంఇఓమహబూబ్‌బాషా, ఎస్సై శివకుమార్, వైస్ ఎంపిపిలు షౌకత్ అలీ, ప్రకాష్, కౌన్సిలర్లు మోహన్‌రాం, నాగరాజు, విజయ్‌కుమార్, కేశవులు, బృందమాల, హెచ్‌ఎంలువెంకటేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో ఘనంగా బాలకృష్ణ జన్మదినవేడుకలు

కాణిపాకం, జూన్ 10 ప్రభాతవార్త:

ప్రముఖ సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను శనివారం కాణిపాకంలో చిత్తూరు బాలకృష్ణ ప్యాన్స్ ఆధ్వర్యంలో బాలకృష్ణ, ఎన్టీఆర్ అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఉదయం ఆలయంలో బాలకృష్ణ పేరిట స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. అలాగే ఆలయం వద్ద 501 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్థానిక బస్టాండు వద్ద అభిమానులు కేక్ కట్ చేసి పంచిపెట్టడంతో పాటు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు ఈకార్యక్రమంలో జిల్లా బాలకృష్ణ అభిమానుల సంఘం అధ్యక్షుడు నరసింహులునాయుడు, చిత్తూరు టౌన్ అధ్యక్షుడు ఎల్‌బి.నాయుడు, శ్రీధర్‌నాయుడు, మురళి, కిరణ్, బుజ్జి, శ్రీదర్, శీను, భాను, యువకృష్ణలతో పాటు పలువురు ఎన్టీఆర్, బాలకృష్ణ అభిమానులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## రైతులకు ఇచ్చిన హామీల అమలులో సిఎం జగన్ వైఫల్యం

**- తెదేపా నేతలు**

కుప్పం, జూన్ 10 ప్రభాతవార్త



రైతులకు ఇచ్చిన హామీల అమలులో సిఎం జగన్‌రెడ్డి వైఫల్యం చెందారని మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కు మార్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, రాష్ట్ర నేతలు శాంతారాం, కాణిపాకం వెంకటేష్ తదితరులు పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెదేపా పాలనలో మాజీ సిఎం చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని లోటు విద్యుత్ సమస్యనుంచి బయటకు తెచ్చారన్నారు. అయితే 2022నుంచి విద్యుత్ లోటు పెరిగి కరెంట్ కోతలతో ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. సిఎం జగన్‌రెడ్డి పాలనలో గతేడాది పవర్ హాలిడే ప్రకటించారన్నారు. రైతులకు ఉచితంగా ఐదుగంటల విద్యుత్ అందిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కనీసం మూడు నాలుగు గంటల కరెంట్ కూడా అందడం లేదన్నారు. రానున్న ఎన్నికల్లో సిఎం జగన్‌రెడ్డికి రైతులు తగిన బుద్ధి చెప ్పడం ఖాయమన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు జిమ్‌దాము, రవి, జాకీర్, నేతలు మణి, మురళి, రాజగోపాల్, జయరాంనాయుడు, బాలు తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ జోన్ బధిరుల క్రీడా పోటీలు ప్రారంభం




కుప్పం, జూన్ 10 ప్రభాతవార్త

రాయలసీమ జోన్ స్థాయి ప్రత్యేక ప్రతిభావంతుల క్రీడా పోటీలను శని వారం కుప్పం పిఇఎస్ వైద్య కళాశా ల గ్రౌండ్‌లో ఘనంగా ప్రారంభిం చారు. కుప్పం విక్టరీ బధిర పాఠశాల వ్యవస్థాపకుడు గోవిందరాజులు మాట్లాడుతూ పిఇఎస్ యాజమా న్యంతో పాటు రెస్కో ఛైర్మన్ సెంధిల్ కుమార్, అక్షయ ఇంటర్నేషనల్ స్కూల్ ఛైర్మన్ డా॥ శరవణ, కుప్పం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డా॥ మహేష్‌ల సహకారంతో ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రత్యేక ప్రతిభావంతుల్లో దాగున్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈపోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. విక్టరీ స్కూల్ స్పందన్, స్థానికులు పాల్గొన్నారు.

## భవిష్యత్తుకు గ్యారెంటీ ఇంటింటికీ తెలియజేయాలి

కోట, జూన్ 10 ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన ఎన్నికల ప్రణాళిక 'భవిష్యత్తుకు గ్యారెంటీ' గురించి ప్రతి ఇంటికీ తెలియజేయాలని కోట పట్టణ టిడిపి అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన కోటలో మాట్లాడుతూ ఎన్నికల ప్రణాళిక భవిష్యత్తుకు గ్యారెంటీ గురించి వివరించారు. వైసీపీ పాలనలో అన్నింటి ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు అల్లాడిపోతున్నారని అన్నారు. రాజమహేంద్రవరంలో జరిగిన మహానాడులో చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాయలసీమ అభివృద్ధిపై రెండురోజుల క్రితం కడపలో పార్టీ యువనేత లోకేష్ చేసిన డిక్లరేషన్ అంశాలను కూడా ప్రచారం చేయాలన్నారు.

# కుల దూషణపై కాణిపాకంలో ప్రమాణం

**- తెలుగుదేశం నాయకులు సవాల్**

బంగారుపాళ్యం, జూన్ 10 ప్రభాతవార్త:

పూతలపట్టు ఎమ్మెల్యేను తమ పార్టీ కార్యకర్తలు కులం పేరుతో దూషించారని జరుగుతున్న ప్రచారంపై తాము కాణిపాకం ఆలయంలో ప్రమాణం చేయడానికి సిద్ధంగా వున్నామని వైకాపా నాయకులకు తెలుగుదేశం నాయకులు సవాల్ విసిరారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల టిడిపి అధ్యక్షుడు ఎన్‌పి జయప్రకాష్ మాట్లాడుతూ తెలుగుదేశం కార్యకర్తలు మొగిలివారిపల్లిలో ఎమ్మెల్యే పర్యటనను అడ్డుకోలేదని, కులం పేరుతో దూషించలేదని పేర్కొన్నారు. కులం పేరిట దూషించారని కాణిపాకంలో ప్రమాణం చేయడానికి వైకాపా నాయకులు సిద్ధంగా వున్నారా! అని ప్రశ్నించారు. ఈ కుల దూషణను నిరూపిస్తూ తాను




మండల టిడిపి అధ్యక్ష పదవికి రాజీనామా చేసి సామాన్య కార్యకర్తగా పార్టీలో వుంటానన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యే ఈ విధంగా అసత్యపూరితమైన ఆరోపణలు చేయడం తగదన్నారు. ముఖ్యంగా బిఆర్ అంబేద్కర్ అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించాలనే ధ్యేయంతో రాజ్యాంగ రూపకల్పన చేశారన్నారు. ఇప్పటి వరకు మండల పరిదిలో తెలుగుదేశం నాయకులు కుల దూషణ, కుల వివక్షణత చూపలేదన్నారు. ఇలాంటి తప్పుడు కేసులు, తప్పుడు ఆరోపణలు చేస్తే పార్టీ అధిష్టానం ఊరుకోదని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిడిపి దళిత నాయకులు దేవయాని, ప్రకాష్, రాజవేలు, శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు. ఇందులో మండల టిడిపి కార్యదర్శి జనార్ధన్‌గౌడు, ఉపాధ్యక్షులు కమలనాథరెడ్డి, నాయకులు హేమచంద్రనాయుడు, రమేష్, వంశీకృష్ణ, జాకీర్, నాసిర్, రాధాకృష్ణ శివ, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## భవిషత్తు గ్యారంటి కోసం పార్టి కార్యాలయం ప్రారంభం

**-మాజి ఎంఎల్ఎ కురుగొండ్ల రామకృష్ణ**

వెంకటగిరి, జూన్ 10 ప్రభాతవార్త



భవిషత్తు గ్యారంటి కోసం టిడిపి కార్యలయాన్ని ప్రారంబించినట్లు మాజి ఎంఎల్ఎ కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. శనివారం పట్టణంలోని క్రాస్‌రోడ్డువద్ద ప్రదాన కూడలిలలో ఆయన టిడిపి కార్యలయాన్ని ప్రారంబించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల గ్యారంటీకోసం పార్టి కార్యలయాన్ని ప్రారంబించినట్లు తెలిపారు. అన్నా క్యాంటిన్ కూడా కొత్తగ ప్రారంబించిన కార్యలయం వద్దనే పెడుతామని తెలిపారు. మాజి ఎఎంసి ఛైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు, నాయకులు కోటేశ్వరరెడ్డి, గంగాదర్, చంద్రమౌళిరెడ్డి, సత్యనారాయణ, విశ్వనాదం, కేవికె ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

**- 2,660 కిలోల బియ్యం స్వాధీనం**

దొరవారిసత్రం, జూన్ 10 ప్రభాతవార్త

దొరవారిసత్రం మండలం కలగుంట, నేలపట్టుకు వెళ్లే మార్గంలో అక్రమంగా నిల్వ చేసి ఉన్న రేషన్ బియ్యాన్ని శనివారం సివిల్ సప్లయిస్ అధికారులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. అక్రమంగా రేషన్ బియ్యాన్ని ఒక ప్రదేశంలో నిల్వ చేసి అక్కడి నుంచి లారీలలో లోడింగ్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా, సమాచారం అందుకున్న సూళ్లూరుపేట సివిల్ సప్లయిస్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. నిల్వ ఉన్న బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారు. అనంతరం కేసు నమోదు చేసి సీజ్ చేసిన బియ్యాన్ని జాగ్రత్తగా ఉంచాలని ఒక డీలర్‌కు అప్పగించారు.

## ఆర్‌బికెలలో క్లస్టర్ విధానం

కోట, జూన్ 10 ప్రభాతవార్త



రైతు భరోసా కేంద్రాల్లో నూతనంగా క్లస్టర్ విధానం తెరపైకి వచ్చింది. పశువులు, జీవాలు, ఇతర పశు సంపద మూడు వేల వరకు పరిగణనలోకి తీసుకొని ఒక క్లస్టర్ ఏర్పాటుకు పశు సంవర్ధకశాఖ రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఇటీవల ఉత్తర్వులు అందాయి. గత ఏడాది ఏప్రిల్ 4 నుంచి నూతన జిల్లాలు ఏర్పాటయ్యాయి. కాకపోతే పాత జిల్లాను ప్రామాణికంగా తీసుకొని సముదాయం వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పశువైద్యశాలలు ఉన్న ప్రాంతాలను మినహాయించి మిగతా ప్రాంతాల్లో రెండు మూడు ఆర్‌బికెలను కలిపి ఒక క్లస్టర్ చేయాలని ఎంపిక చేశారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో ఇటీవల కసరత్తు పూర్తి చేశారు. ఎంపిక చేసిన గ్రామాల సమాచారాన్ని జిల్లా కేంద్రానికి పంపించారు. అక్కడి నుంచి రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిసింది. కాకపోతే ఈ వివరాలు వెల్లడించకుండా ఆ శాఖ అధికారులు గోప్యత పాటిస్తున్నారు. నూతన విధానం అందుబాటులోకి వస్తే పశువైద్య విద్య చదివిన నిరుద్యోగుల కొలువుల ఆశలపై నీళ్లు చల్లినట్లే. పశుసంపద తక్కువగా ఉన్న ఆర్‌బికె కేంద్రాల్లో పనిచేస్తున్న ఎహెచ్‌ఎలను అధికంగాపశువులు, జీవాలుఉన్నపొరుగుప్రాంతాల్లోకిసర్దుబాటు చేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

## ఇంటర్‌లో అరకొరగానే పాఠ్య పుస్తకాలు

కోట, జూన్ 10 ప్రభాతవార్త

విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని, విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా విద్యావసతి దీవెనలు తల్లుల ఖాతాల్లోకి జమ చేస్తున్నామంటూ పదేపదే చెప్తున్న పాలకులు ఏటా ఇవ్వాల్సిన పాఠ్య పుస్తకాలు ఇవ్వకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు క్రమం తప్పకుండా ప్రతి ఏడాది అందించాల్సిన పాఠ్య పుస్తకాల విషయాన్ని ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది. గత సంవత్సరం పాఠ్య పుస్తకాలు లేకుండానే ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలుగు అకాడమి ద్వారా ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇంటర్ పాఠ్య పుస్తకాలను ఉచితంగా అందజేస్తూ వస్తున్నారు. కరోనా సమయంలో పుస్తకాల సరఫరాలో ఏర్పడిన ప్రతిష్టంభన ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వ కళాశాలల్లో అత్యధికశాతం పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారే ఉన్నారు. గత ఏడాది కొన్ని కళాశాలల్లో అధ్యాపకులే చొరవ తీసుకొని పూర్వ విద్యార్థుల నుంచి సేకరించిన పుస్తకాలతో విద్యాబోధన సాగించారు. ప్రైవేటు కళాశాలల్లో ప్రత్యేకంగా స్టడీ మెటీరియల్ ఇచ్చి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తుండగా, ప్రభుత్వ కళాశాలల్లో పాఠ్య పుస్తకాలు లేకపోవడం గమనార్హం.

# అటవీశాఖ రేంజర్‌పై కేసు నమోదు

దొరవారిసత్రం, జూన్ 10 ప్రభాతవార్త

దొరవారిసత్రం మండలం నేలపట్టు వన్యప్రాణి విభాగం కేంద్రంలో ఫారెస్ట్ రేంజర్‌గా పనిచేస్తున్న వరప్రసాద్‌పై శుక్రవారం రాత్రి అత్యాచారయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జె.తిరుమలరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అటవీశాఖలో వెదురుపట్టు బీట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఓ మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడటం, మహిళలపై వేధింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యా దులు అందడంతోఅధికారులు విచారించి కేసు నమోదు చేశారు.

### నేలపట్టులో కలకలం

నేలపట్టు పక్షుల రక్షిత రక్షిత కేంద్రంలో ఒక్కసారిగా కలకలం రేగింది. అటవీప్రాంతం మధ్యలో ఉన్న పక్షుల రక్షిత కేంద్రంలో ఇటు మహిళా ఉద్యోగులు ఒకరిద్దరు పనిచేస్తున్నారు. అయితే ఒక్కసారిగా నేలపట్టు పక్షుల కేంద్రంలో ఉన్నతాధికారే క్రింది స్థాయి మహిళా ఉద్యోగుల పట్ల ఇలా వ్యవహరించడం విమర్శలకు దారితీస్తోంది. గతంలోనూ పక్షుల కేంద్రంలో పక్షులను చంపేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పక్షులను కాపాడాల్సిన అధికారులు నిఘా వదిలేసి.. అసభ్యకరమైన చేష్టలకు పాల్పడటంపైవిమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడుపక్షులను వీక్షించడానికి వచ్చే పక్షి ప్రేమికులపై ఫారెస్ట్ అధికారులు బెదిరింపులకు పాల్పడటం, వేధించడం వంటివి ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు నేలపట్టు పక్షుల కేంద్రంలో అధికారుల తీరుపై విచారణ జరిపి నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సూళ్లూరుపేట, జూన్ 10 ప్రభాతవార్త

శ్రీచెంగాళమ్మ తిరునాళ్లలో భాగంగా శనివారం రాత్రి స్థానిక శ్రీచెంగాళమ్మ మైదానంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రపంచ ప్రఖ్యాత శివమణిచే డ్రమ్స్ వాయించే కార్యక్రమం ఆకట్టుకుంది. బుల్లెట్ భాస్కర్ బృందంచే హాస్యవల్లరి, సినీ సింగర్ కీర్తన శర్మ, సాయిశిల్ప, ఫోక్ సింగర్ తేలు విజయతో పాటకచ్చేరి, సినీ యాంకర్ శ్యామల కార్యక్రమాలను నిర్వహించారు. సినీ హీరోయిన్ మాన్రాచోప్రా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

## సభికులను మంత్ర ముగ్ధులను చేసిన 'సహస' నృత్యాభినయం!

తిరుపతి ప్రెస్‌క్లబ్, జూన్ 10 ప్రభాతవార్త:



శనివారం రాత్రి స్థానిక మహతి కళాక్షేత్రం నందు అమెరికాకు చెందిన ఎన్‌ఆర్ఐ ప్రిషిత సహస ప్రదర్శించిన భరతనాట్య నృత్యాభినయంతో సభికులను మంత్ర ముగ్దులను చేసింది. తిరుపతికి చెందిన ఏపిఎస్‌పిడిసిఎల్ రిటైర్డ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సుబ్బన్న మనవరాలు అమెరికాలో నివాసముంటూ భారతీయ కళలపై ఆసక్తితో భరతనాట్యం అభ్యసించి తొలిసారిగా తన అరంగేట్రాన్ని ప్రిషిత సహస మహతి కళాక్షేత్రం వేదికగా తన నృత్యాభినయాన్ని సభికుల ముందు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ఎస్వీ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఉమా ముద్దుబాల, మృదంగం విభాగాధిపతి ఎం.సుధాకర్, నృత్యాచారుడు పి.రవి సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా హాజరయ్యి జ్యోతి ప్రజ్వలన గావించి నృత్య అరంగేట్రం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారి సహస చక్కటి హావభావాలతో, తన ఆహార్యంతో లయబద్ధంగా నృత్య ప్రదర్శన చేసి ప్రేక్షకుల మన్ననలు అందుకొంది. నగరానికి చెందిన సహస అమెరికాలో ఉన్నా.. భారతీయ సంస్కృతి సాంప్రాదాయాల పట్ల మక్కువతో భరతనాట్యం నేర్చుకుని ఇంతమంది ప్రేక్షకుల మధ్య గొప్పగా ప్రదర్శించడం పట్ల తిరుపతి ఫిలిం సొసైటీ ఛైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి సిఆర్‌కె.శేషగిరిరావు, ప్రసాద్‌రావు, బుజ్జిబాబు, శాంతావాణి, వికె రెసిడెన్సీ అధినేత పి.సూర్యప్రకాష్, పలువురు నృత్యాచారులు చిన్నారి సహసను అభినందించి తమ హర్షాన్ని వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారి సహస తల్లిదండ్రులు శైలజ, విజయ్‌కుమార్, గురువు గురు కళశ్రీ ఆషా గోపాల్, తాత రిటైర్డ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సుబ్బన్న, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కరెంటు బిల్లు తాకితే షాక్ కొడుతోంది

**- గాలి భానుప్రకాష్**

వడమాలపేట, జూన్ 10 ప్రభాతవార్త:



వైసీపీ పాలనలో కరెంటు బిల్లు ముట్టుకుంటేనే షాక్ కొట్టే విధంగా ఉందని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ అన్నారు. శనివారం వడమా లపేటలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీపాలనలో విద్యుత్‌చార్జీల పెంపుపై విరుచుకుపడ్డారు. నేడు వైసీపీ పాలనలో విద్యుత్ లోటు రాష్ట్రంగా మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులోని విద్యుత్ ఉపయోగించుకోలేదని తెలిపారు. కాలనీల్లో ఉంటేనే ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పడం దారుణమన్నారు. ఉచిత విద్యుత్‌కు మీటర్లు ఎందుకని ప్రశ్నించారు. షిరిడీ సాయి కంపెనీకు మీటర్ల కొనుగోలు కాంట్రాక్టు ఇచ్చి, ప్రజా సొమ్ము దోచుకుంటున్నారని తెలిపారు. కంపెనీలు కూడా వైఎస్‌జగన్ అవినాష్‌రెడ్డి బినామీల దని ఆరోపించారు. రాష్ట్రాన్ని పూర్తిగా తమ స్వార్థ ప్రయోజనాల కోసం కొల్లగొడుతున్నారని విమర్శించారు. సమావేశంలో చిత్తూరు పార్లమెంట్ అధికారి ప్రతినిధి ధనంజయనాయుడు, పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న, వెంకటయ్య, హేమావతి, శేషాద్రి యాదవ్, వెంకటేశ్వరరావు, బత్తయ్య, రాధాకృష్ణ, శివరాయల్, సుబ్బరాయుడు, వినోద్, చైతన్య, వెంకయ్యరాజు, శ్రీనివాసులు, వెంకయ్య, శివరాజు, మోహన్‌లు పాల్గొన్నారు.

## ఉత్సవమూర్తులను సమర్పించిన దాతలు



వడమాలపేట, జూన్ 10 ప్రభాతవార్త:

వడమాలపేట సంజీవరాయ ఆలయముకు పంచలోహాలతో తయారు చేసిన సీత, రామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులను దాతలు సమర్పిం చారు. వడమాలపేట క్రాంతివీధికి చెందిన అరవింద కుమార్, ధర్మపతిని, షిర్మల వీటిని గుడికి సమర్పిం చారు. పరిసర గ్రామ ప్రజలు విశేషంగా పాల్గొనిస్వామి వారినిదర్శించి అన్నప్రసాదాలు స్వీకరించారు.

## పగటి పూట మండుతున్న ట్రాన్స్‌ఫార్మర్

వాకాడు, జూన్ 10, ప్రభాతవార్త

పట్టపగలే జనా నివాసాలు మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లు మంటలు రేగుతున్నాయి. శుక్రవారం రాత్రి నుండి శనివారం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా లేకుండా పోవడం ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండల పరిధిలోని వాకాడుతో పాటు పలు గ్రామాలలోని శుక్రవారం రాత్రి ఉరుములు మెరుపులతో బీభత్సం అకాల వర్షం రావడంతో విద్యుత్ అంతరాయం కలిగింది. దీంతో ఇప్పటి వరకు ప్రజలతో పాటు వ్యవసాయదారులు కూడా పలు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల విద్యుత్ ఉరుములు మెరుపులతో ఇంట్లో ఉన్న పరికరాలు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల వస్తువులు ధ్వంసం అయ్యాయి. ముఖ్యంగా శనివారంను ఉదయం నుండి విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో, సాయంత్రం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా రాలేదు, మధ్యాహ్నం విద్యుత్ సరఫరా వచ్చినప్పుడు నుండి మండలంలోని ఈదురుగాలులుతో బీభత్సం అయ్యాయి. అప్పుడు నుండి విద్య సరఫరా అంతరాయం అయింది. పలుచోట్ల ఉరుములతో మెరుపులు ఎక్కువైంది. వర్షం పడే అవకాశం ఎక్కువగా ఉంది.

## ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

పుత్తూరురూరల్, జూన్ 10 ప్రభాతవార్త:



కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరణ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించడంతో శనివారం స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ముఖ్యమంత్రి చిత్రపటానికి కాంట్రాక్టు ఉద్యోగులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న తమకు గుర్తింపు లేదని ప్రస్తుతం ముఖ్యమంత్రి కాంట్రాక్టు ఉద్యోగులు క్రమబద్ధీకరణ చేస్తున్నడంతో తమకు ఉద్యోగ భద్రత జీవితానికి భరోసా కలిగిందని కొనియాడారు. కార్యక్రమంలో పుత్తూరు, పరమేశ్వర మంగళం, గొల్లపల్లి ప్రభుత్వాస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## సీతారామక్ష్మణులను దర్శించుకున్న పవిత్రారెడ్డి

తొట్టంబేడు, జూన్ 10 ప్రభాతవార్త



మండలంలోని చిన్నకనపర్తి గ్రామంలో శ్రీసీతారాములక్ష్మణ, హనుమంతసమేత శ్రీరామ చంద్రమూర్తి బింబ ప్రతిష్ట కార్యక్రమంలో ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి తనయ బియ్యపుపవిత్రారెడ్డి హజరై స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆమెకు స్థానిక గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అనంతరం పవిత్రారెడ్డి మాట్లాడుతూ రామమందిరాలు లేని గ్రామాలు దేశంలో ఎక్కడా లేవని భక్తిశ్రద్దలతో పూజలు చేస్తే కోరిన కోర్కెలు చ్చే సీతామలక్ష్మణులను పూజించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విమలగోపి, ఎంపిటిసి సుబ్రమణ్యం, మాజీ సర్పంచ్ మణినాయుడు, మాజీ ఎంపిపి చంద్రయ్యనాయుడు, నరసింహనాయుడు,పిల్లమేడు భాస్కర్, సురేష్, చంద్ర,సుబ్రమణ్యం, రాధ, శ్రీరాములురెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, అల్లెయ్య, భాస్కర్, మణి దీపక్‌రెడ్డి, నాగమణి, వెంగళరావు, తీర్ధరామన్,తదితరులు పాల్గొన్నారు.

## యోగా గురువుకు ఘనసత్కారం

శ్రీకాళహస్తి, జూన్ 10 ప్రభాతవార్త



77వసంతాలు పూర్తి చేసుకుని 78వ పుట్టినరోజు జరుపుకుంటున్న ప్రముఖ యోగా గురువు మార్కండేయులను శనివారం శిష్యబృందం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా శుకబ్రహ్మ శ్రమంలో ప్రతిరోజు నిర్వహించే ఉచిత యోగా శిక్షణలో సుమారుగా ఇప్పటి వరకు 1600కి పైగా శిక్షణ ఇవ్వడం జరిగింది. విద్యార్థులకు ఉచితంగా భగవద్గీత నేర్పిస్తారు. సమాజానికి చేస్తున్నటువంటి ఆరోగ్య పరమైన అధ్యాత్మిక పరమైన సేవ వెలకట్టలేదని పలువురు యోగా విద్యార్థులు తెలుపుతూ ఆయన్ను దుశ్శావతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం యోగా గురువు మార్కండేయులు మాట్లాడుతూ యోగాతోనే ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతుగా ఉంటారన్నారు.

## ఘనంగా బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు

-ఏరియ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ

శ్రీకాళహస్తి, జూన్ 10 ప్రభాతవార్త



ప్రముఖ సినీనటుడు హిందూ పురం శాసనసభ్యులు, పొలిట్ బ్యూరో సభ్యుడు నందమూరి బాలకృష్ణ 63వ పుట్టినరోజు సందర్భంగా తెదేపా రాష్ట్ర కార్యదర్శులు గాలిచలపతి నాయుడు, రెడ్డివారిగురవారెడ్డి, దశరధాచారి, రాష్ట్ర సాధికార కమిటీ సభ్యులు మిన్నల్‌రవి, పార్లమెంటు పార్టీ కోశాధికారి కంటారమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, ఆధ్వర్యంలో తొలుత పార్టీ కార్యాలయంలో కేక్‌కట్‌చేసి తెదేపా కార్యకర్తలు, నాయకులకు పంచిపెట్టారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలో గర్బిణీస్త్రీలకు, బాలింతలకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీచేశారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ అటు సినీరంగంలోను, ఇటు రాజకీయరంగంలోను రాణిస్తున్న ఏకైక హీరో నందమూరి బాలకృష్ణ ఒక్కరే అన్నారు. కార్యక్రమంలో షాకిరాలీ, బుజ్జి, గోపినాద్, ఉమేష్‌రావు, కిట్టు, షఫి, వెంకటేశ్వరచౌదరి, రాఘవులు, ఎంఎస్‌రెడ్డి, మునిరాజయాదవ్, వజ్రంకిషోర్, ఆర్ముగం, సిద్దులయ్య, కృష్ణమనాయుడు, మణికంఠ, లక్ష్మినారాయణగుప్తా తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌షాక్‌కు సంజయ్ మృతి

నగరి, జూన్ 10 ప్రభాతవార్త:



నగరి మున్సిపాలిటీ 8వ వార్డు కీళపట్టు దళితవాడకు చెందిన వైసీపీ యువ కార్యకర్త టి.సంజయ్ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. కీళపట్టు గ్రామంలో సంజయ్ మృతదేహానికి మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు మున్సిపాలిటీ డైరెక్టర్ చంద్రారెడ్డి, కౌన్సిలర్ యాకోబ్, యువ నాయకులు ఉన్నారు.

## వైసీపీ పాలనలో కరెంటు చార్జీల బాదుడు

- గాలి భానుప్రకాష్

నగరి, జూన్ 10 ప్రభాతవార్త:

వైసీపీ పాలనలో కరెంటు చార్జీల బాదుడు ప్రతినెల కొనసాగుతోందని, బిల్లు పట్టుకుంటే షాక్ కొట్టే పరిస్థితికి తెచ్చిన జగన్, విద్యుత్ రంగం గాడిలో పడాలంటే తెలుగుదేశం పార్టీ వస్తేనే సాధ్యమని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ తెలిపారు. నగరిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో విద్యుత్ లోటు రాష్ట్రంగా మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ కే దక్కుతుందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులోని విద్యుత్ ఉపయోగించుకోలేదని తెలిపారు. కాలనీల్లో ఉంటేనే ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పడం దారుణమన్నారు. కంపెనీలు కూడా వైఎస జగన్ అవినాష్‌రెడ్డి బినామీల దని ఆరోపించారు. రాష్ట్రాన్ని పూర్తిగా తమ స్వార్థ ప్రయోజనాల కోసం కొల్లగొడుతున్నారని విమర్శించారు. సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 12న ధర్మకర్తల మండలి సమావేశం

ఏర్పాట్లు ఘనం: నిర్వహణే ప్రశ్నార్థకం

శ్రీకాళహస్తి,జూన్ 10 ప్రభాతవార్త



ఈ నెల 9 శుక్రవారం జరగా ల్సిన శ్రీకాళహస్తీ శ్వరాలయ ధర్మకర్తల మండలి సమావేశం ఇటకు అస్వస్థత తో వాయిదా పడిన విషయం పాఠకు లకు విదితమే., ఈ సమావేశంను ఈ నెల 12 సోమవారం నిర్వహించు టకు అధికారులు శనివారం ప్రకటిం చారు. ఉదయం 11 గంటలకు సమా వేశం హాలులో నిర్వహించ బడుతుందని ప్రకటించారు. ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన తరువాత ధర్మకర్తల మండలి సమావేశాలు రహస్యంగా నిర్వహించటం పరిపాటి అయ్యింది. గత ప్రభుత్వ హయాంలో ధర్మకర్తల మండలి సమావేశాలకు మీడియాను ఆహ్వానించే వారు. సలహాలను తీసుకునే వారు. కానీ ప్రస్తుత ప్రభుత్వ పాలనలో అంతా రహస్యమే అన్నట్లు మారింది. అయితే ధర్మకర్తల మండలి సమావేశానికి సంబంధించి విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు సమాచారం.

**16 మంది ఉద్యోగులకు బాధ్యతలు:**

శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సమావేశం రోజు ఏర్పాట్లును పర్యవేక్షించుటకుపది మంది ఉద్యోగులకు బాధ్యతలు అప్పగిస్తూ ఇఓ ఉత్తర్వులు జారి చేసారు. ఎఇఓ బియల్‌యన్ ప్రసాద్,పర్యవేక్షకులు ఎన్.శ్రీహరి,రి.ఆధికారులు టి.వెంకయ్య, సి.అన్వేష్‌లకు సమావేశంలో చర్చించు అంశాలను ఇఓకు వివరించుటకు, కే.ప్రదీప్‌రెడ్డి, బి.యోగేశ్‌బాబు టి.మునిసాయి కుమార్‌లకు సభ్యులకు రిజిస్టర్లలో సంతకాలు పెట్టించి వారికి అజెండాలు అందజేయుట,జి.దుర్గాప్రసాద్, జి.గోపాల్, బి.పార్థసారధిలకు అవసరమైన ముందస్తు ఏర్పాట్లు పర్యవేక్షించుటకు, పిఆర్‌ఓకు సమావేశంలో అధికారులు,ధర్మకర్తల మండలి సభ్యులకు అల్పాహారం బోజనాల ఏర్పాటు పర్యవేక్షించే బాధ్యతలను అప్పగించారు.సమావేశంలో చర్చించిన అంశాలకు సంబంధించిన సమాచారాన్ని మీడియాకు అందించే బాధ్యతను మీడియా ఇన్‌చార్జి యస్‌పిఆర్‌కె.ప్రశాంత్‌కు,సమావేశంలో సుమారు వంద మందికి కాఫీలు టీలు అందించే బాధ్యతలను అన్నదాన గుమాస్తాకు,సమావేశంలో పులిహోర, జిలేజీ ప్రసాదాలను ప్రసాదాల పోటు గుమాస్తాకు,పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా బాధ్యతను శానిటరీ ఇన్సెపెక్టర్‌కు అప్పగించారు. సభ్యులకు తెల్లకాగితాలు పేనాలు పెన్సిల్సు అందించే బాధ్యతను స్టేషనరీ గుమాస్తాకు, భద్రతా ఏర్పాట్లను ముఖ్య భద్రతా అధికారికి అప్పగిస్తూ ఇఓ పేర ఉత్తర్వులు జారి అయ్యాయి.

## 24 నుండి కల్యాణ వెంకన్న సాక్షాత్కార వైభవోత్సవాలు

22న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం.. 24 నుండి విశేష వాహన సేవలు

చంద్రగిరి, జూన్ 10 ప్రభాతవార్త:

ఈ నెల 24 నుండి 26 వరకు మూడు రోజుల పాటు కల్యాణ వెంకన్న ఆలయంలో సాక్షాత్కార వైభవోత్సవాలు నిర్వహించనున్నట్లు టిటిడి పిఆర్‌ఓ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈ నెల 24 నుండి మూడు రోజులు స్వామి వారికి సాక్షాత్కార వైభవోత్సవాలు ఆగమోక్తంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 22న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) గావించనున్నారు. 24 నుండి మూడుల పాటు ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు ఆలయ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత స్వామి వారికి స్నపన తిరుమంజన సేవ నిర్వహించనున్నారు. 24న రాత్రి పెద్దశేష వాహనం, 25న హనుమంత వాహనం, 26న గరుడవాహన సేవ నిర్వహించనున్నారు. 27న శ్రీవారిమెట్టు మార్గంలోని మండపంలో ఉదయం 7 గ ంటల నుండి పార్వేటి ఉత్సవం నిర్వహించనున్నారు. సాక్షాత్కార వైభవోత్సవాలను పురస్కరించుకుని 22 నుండి 27 వరకు ఆలయంలో ఆర్జిత సేవలను రద్దు చేశారు.

## కార్యకర్త మృతికి నివాళి అర్పించిన భానుప్రకాశ్

విజయపురం, జూన్ 10 ప్రభాతవార్త :



మండలంలోని బూచివానత్తం అంకమ్మ కాలనీలో టిడిపి కార్యకర్త షణ్ముగం శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ శనివారం మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్, నాయకులు బాబు, మురళి, పొన్నుస్వామి తదితరులు పాల్గొని సంతాపం వ్యక్తం చేశారు.

## శిథిలావస్థలో అగరం రామకృష్ణ సింగిల్ విండో భవనం



విజయపురం, జూన్ 10 ప్రభాతవార్త : మండలంలోని ఎం.అగరంలో రామకృష్ణ సింగిల్ విండో భవనం శిథిలావస్థకు చేరు కుంది. గత ఆరు సంవత్సరాలుగా ఈ భవనం పాడుపడి వుంది. ఈ భవనం ద్వారా గతంలో రైతులకు సబ్సిడీ విత్త నాలు, ఎరువులు సరఫరా చేసేవారు. ప్రస్తుతం భవనానికి మరమ్మతులు నిర్వహించకపోవడంతో శిథిలా వస్థకుచేరుకుందని,అధికారులుస్పందించిభవనానికిమరమ్మతులునిర్వహించాలనిగ్రామస్తులు కోరుతున్నారు.

## ఎన్నికల సమయాన జగన్ రెడ్డి కపట ప్రేమ

మహిళల ఆర్థిక స్వాలంబన చంద్రబాబు లక్ష్యం

టిడిపి జిల్లా అధికార ప్రతినిధి చినబాబు



రామచంద్రాపురం, జూన్ 10 ప్రభాతవార్త:

ఎన్నికల సమయం సమీపిస్తుండటంతో ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఓటమి భయంతో మహిళలపై కపట ప్రేమను కనబరుస్తున్నారంటూ టిడిపి జిల్లా అధికార ప్రతినిధి చినబాబు దుయ్యబట్టారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కోట్లాది మంది మహిళల ఆర్థిక స్వాలంబన లక్ష్యంగా ద్వాక్రా (వెలుగు) సంఘాలను ప్రారంభించారన్నారు. మహిళలకు చంద్రన్న భీమా ద్వారా ప్రభుత్వమే భీమా మొత్తాన్ని చెల్లించేదన్నారు. 2019 నుండి చంద్రన్న భీమా పధకాన్ని తొలగించిన జగన్ వైఎస్ఆర్ భీమాగా పేరు మార్చడం మినహా ఎటువంటి భీమా చేయలేదన్నారు. గడచిన నాలుగేళ్ళుగా మహిళలు వైఎస్ఆర్ భీమా గురించి ఆందోళన చేస్తున్నప్పటికీ పట్టించుకోలేదన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో జగన్ రెడ్డి తన జిత్తులమారి తనాన్ని ప్రదర్శిస్తూ రెండో విడత ఆసరా పధకంలో మహిళల ఖాతాలో వేసిన సొమ్ము నుండి 50 ఏళ్ళలోపు మహిళలకు రూ.456/-లు, 50 నుండి 70 ఏళ్ళలోపు వారికి రూ.436/-లు వంతున జమచేసుకోవాలని బ్యాంకులకు అనుమతివ్వడం కపట ప్రేమ, మోసం కాదా అంటూ నిలదీశారు.

## తిరుపతి జిల్లా డెఫ్ స్పోర్ట్స్‌ఫెడరేషన్



నూతన కార్యవర్గం

తిరుపతి,జూన్ 10ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ద డెఫ్ నూతన కార్యవర్గం ,నూతన అసోసియేషన్ శనివారం ఎన్నుకు న్నారు. టిటిడి జనరల్ ఉద్యోగుల సంక్షేమ అసోసియేషన్ నాయకులు రవికుమార్, సెక్రటరీ జనరల్ రామకృష్ణ, ఉపాధ్యక్షుడు చెన్నయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ హరిబాబు, సంయుక్తకార్యదర్శి సుబ్రమణ్యం(సుబ్బు),సునీల్,చంద్రశేఖర్‌ల సారధ్యంలో ఈ నూతన కార్యవర్గం ఏర్పాటుకు సహకారమందించారు. టిటిడి వినాయకనగర్ వసతి గృహాల వద్దవున్న టిటిడి రిక్రియేషన్‌హాల్‌లో తిరుపతి జిల్లా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ ద డెఫ్ సభ్యులకు అన్ని విధాలా సహకారమందించి మధ్యాహ్నం భోజనవసతి కల్పించారు. ఈ సందర్భంగా టిటిడి ఉద్యోగుల సంఘం నాయకుల ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎంపికైంది. అధ్యక్షుడుగా సి.సునీల్ , సెక్రటరీ ఆఫ్ జనరల్ సి.వెంకటకుమార్, ఉపాధ్యక్షుడు సి.మహేష్‌కుమార్, కోశాధికారి ఫరూక్, సంయుక్తకార్యదర్శి ఎస్‌ఎం వెంకటేశ్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఆర్.శ్రీనివాసన్, బి.గౌరి ఉన్నారు.

## జాతీయ స్విమ్మింగ్ పోటీలలో రెడ్డి ఈశ్వర్‌కు ప్రశంసా పత్రం

తిరుపతి (క్రీడ), జూన్ 10, ప్రభాతవార్త



న్యూఢిల్లీలో ఈ నెల 6వ తేది నుండి 12వ తేది వరకు నిర్వహించిన 66 జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలలో తిరుపతికి చెందిన హసనపురం రెడ్డి ఈశ్వర్ పార్టిసిపేట్ పత్రాన్ని అందుకున్నారు. జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలలో స్విమ్మింగ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున రెడ్డి ఈశ్వర్ పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన స్విమ్మింగ్‌లోని డైవింగ్ విభాగంలో క్రీడాకారులతో రెడ్డి ఈశ్వర్ పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన స్విమ్మింగ్‌లోని డైవింగ్ విభాగంలో క్రీడాకారులతో రెడ్డి ఈశ్వర్ పోటాపోటీగా చివరకు పార్టిసిపేట్ పత్రాన్ని అందుకున్నారు. శనివారం రోజున పార్టిసిపేషన్ సర్టిఫికేట్‌ను స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ దీపక్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చేతుల మీదుగా అందుకున్నారు. రెడ్డి ఈశ్వర్ తిరుపతి నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడం పట్ల పలువురు క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు రెడ్డి ఈశ్వర్‌ను అభినందించారు. రెడ్డి ఈశ్వర్ గత 15సంవత్సరాలుగా పలు క్రీడా విభాగాలలో జిల్లా, రాష్ట్రస్థాయి పథకాలు ఎన్నో సాధించారు.

## రాస్ ఉచిత మెగా పశు వైద్యశిబిరం

రేణిగుంట, జూన్ 10, ప్రభాతవార్త



రేణిగుంట మండలం గొల్లపల్లి గ్రామంలో రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గొల్లపల్లి, పరిసర గ్రామాలలోని రైతుల పశువులకు ఏరియా వెటర్నరీ డాక్టర్ స్రవంతి బృందం శనివారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరానికి విశేషమైన స్పందన లభించింది. శిబిరానికి రైతులు ఆవులు, ఎనుములు, దూడలను తీసుకొచ్చారు. వీటికి వేసవిలో వస్తున్న సమస్యలు, నివారణోపాయాలను వైద్య బృందం వివరించారు. పరీక్షలు చేసి సూదులు, మందులు ఉచితంగా అందజేసారు. పశువులకు పురుగుల మందు తాగించడం, పిడుదులకు సంబంధించి మందును స్ప్రే చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ లీడర్లు, ట్రస్టీ సుబ్బరత్నమ్మ, ట్రస్ట్ సిబ్బంది, ప్రాజెక్టు ఆఫీసర్, గోపాల్ మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి మృతి

శ్రీకాళహస్తిరూరల్, జూన్ 10 ప్రభాతవార్త



లలిత(ఫైల్‌ఫోటో)

శ్రీకాళహస్తి -తిరుపతి జాతీయ రహదారిలోని సీతారామ పేట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సచివాలయ డిజిటల్ ఉద్యోగి అకాల మరణం చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి.శ్రీకాళహస్తి దర్గా మిట్టలో నివాసముంటున్న లలిత(37) వడమాల పేట మండలం ఎస్‌వి పురం సచివాలయంలో డిజిటల్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. రోజూ ఆమె విధి నిర్వహణకు తమ స్కూటిలో వెళ్ళి వచ్చేది. ఈ నేపద్యంలో శనివారం విధి నిర్వహణకు వెళ్ళి వస్తుండగా వెంకటగిరి నుంచి తిరుపతికి మామిడికాయల లోడ్ తీసుకెళుతున్న మినిలారీ ఎదురుగా వస్తున్న కారును ఢీకొని వెనుకనే వస్తున్న స్కూటిని ఢీకొటింది. ఈ ప్రమాదంలో లలిత అక్కడికక్కడే మృతి చెందింది, ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసారు.మృతురాలికి ఇద్దరు బిడ్డలు, భర్త ఇటీవలే కోవేట్ నుంచి వచ్చారు.

## ప్రభుత్వం ఇచ్చింది పలుపథకాలు:మీరు ఏం కావాలని కోరుకుంటున్నారు?

బియ్యపు మధుసూధనరెడ్డి

శ్రీకాళహస్తి రూరల్, జూన్ 10 ప్రభాతవార్త



యువ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిరుపేదల అభ్యున్నతే లక్ష్యంగా నవరత్నా లను అందించారు. ఎన్నో సంక్షేమ పథకాలు అందించారు. నిరుపేదలైన అర్హులకు సరాసరి దళారుల సంబంధం లేకుండా ఖాతాల్లో నగదు అందిస్తున్నా రు. మరి జనం ఇంకేం కోరుకుంటున్నారని శ్రీకాళహ స్తి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ప్రజలను ప్రశ్నిస్తూ ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరిస్తున్నారు.'నువ్వే మా నమ్మకం జగన్' అనే కార్యక్రమంలో భాగంగా ఆయన శ్రీకాళహస్తి మండలంలోని చల్లపాలెం సచివాలయ పరిధిలోని చటర్జీ నగర్,చల్లపాళెం దళిత వాడ గ్రామాల్లో పర్యటించారు. ఆయనకు గ్రామాల్లో ఘనస్వాగతం పలికారు. ఆయనతోపాటు రామచంద్రయ్య, భాస్కరయ్య, సరళ, రమణయ్య, చిరంజీవులు, ధనంజయులు, వెంకటేష్, వేణు, ఎంపిటిసి హరి,చంద్రబాబు, ఎల్లప్పరెడ్డి, కేశవ, ప్రసాద్, కోవి చంద్రయ్యనాయుడు వైకాపానాయకులు మండల అధికారులు తదితరులుపాల్గొన్నారు.

## పిఆర్సి, డిఏ అరియర్స్ చెల్లింపుకు

నాలుగు సంవత్సరాలు గడువు పెట్టడం విచారకరం

జిల్లా పెన్షన్ల సంఘం అధ్యక్షులు, జిల్లా సహాధ్యక్షులు అధ్యక్షులు ఆవేదన

తిరుపతి (క్రీడ), జూన్ 10, ప్రభాతవార్త



పిఆర్సి, డిఏ ఆరియర్స్ చెల్లింపుకు నాలుగు సంవత్సరాలు గడువు పెట్ట డం విచారకరమని జిల్లా పెన్షన్ల సంఘం అధ్యక్షులు కెఆర్ శంకర్, జిల్లా సహాధ్యక్షులు, ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు టి. గోపాల్ ఆవేదన వ్యక్తం చేసారు. తిరుపతి జిల్లా పెన్షన్ కార్యాలయంలో జరిగిన పెన్షనర్ సమావేశంలో పెన్షనర్లు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ఇప్పటికే పెన్షనర్లను 2018 జూలై నుండి రిటైర్డ్ అయిన విశ్రాంతి ఉద్యోగులకు డిఏ అరియర్స్ బిల్లులు చెల్లించాలని, ఈ కేవైసీ పేరుతో ఇబ్బందులు గురి చేస్తున్నారని నెల నెల ఒకటో తారీకు పెన్షన్ వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని, 70 సంవత్సరాలు దాటిన సీనియర్ పెన్షన్లకు చెల్లించాల్సి న అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ జనవరి నెల నుంచి పెండింగ్‌లో ఉన్నదని అలాగే 2018 నుంచి డిఏలు ఉత్తర్వులు విడుదలైన చెల్లింపులు జరుపుకుండా కేవలం సిఎఫ్‌ఎంఎస్ ఖాతాల్లో చూపి ఉద్యోగులు పెన్షనర్ నుండి ఆదాయపు పన్ను మాత్రం వసూలు చేస్తున్నారని వారి ఖాతాలో నగదు మాత్రం జమ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో పెన్షన్ల సంఘం సీనియర్ నాయకులు టివి రమణ, కోశాధికారి ఎస్‌జి మునికృష్ణన్, కార్యవర్గ సభ్యులు దేవరాజు, డా. రవణప్ప, అల్లాబక్ష, సంఘం భవన కమిటీ నాయకులు మునికృష్ణయ్య, మునిచంద్ర నాయుడు, జయరామయ్య, మోహర్ ఉన్నిసా, బేగం, భాగ్యలక్ష్మి, నవనీతమ్మ, కస్తూరి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## కోదండ రామాలయంలో "అన్నదానం"

అన్నదానం దాతలకు సాదర ఆహ్వానం

డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు



చంద్రగిరి, జూన్ 10 ప్రభాతవార్త:

స్థానిక టిటిడి అనుబంధ శ్రీకోదండ రామాలయంలో దాతల సహకారంతో శనివారం అన్నదానం కార్యక్రమాన్ని టిటిడి కపిలతీర్థం అనుబంధ ఆలయాల డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు ప్రారంభించారు. చారిత్రాత్మక నేపధ్యం కలిగిన చంద్రగిరిలో అత్యంత పురాతనమైన శ్రీ కోదండరామాలంలో అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించడం ఆనందంగా వుందన్నారు. కోదండ రామాలయానికి భక్తుల సందడి పెంచడంలో భాగంగా ఆలయ సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోవడానికి స్థానికులు, అన్నదానం కొరకు దాతల సహకారం కోరారు. ఇందులో భాగంగా ఆలయంలో ప్రతి శనివారం స్వామివారి భక్తులకు అన్నదానం జరిపించాలని నిర్ణయించగా, మొదటి సారి కోదండ రామాలయ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ, పరిమల దంపతులు భక్తులకు అన్నదానం జరిపించినట్లు వివరించారు. ఇదే స్ఫూర్తితో ఆలయంలో ప్రతి శనివారం భక్తులకు అన్నదానం చేయడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. అన్నదాన కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఏఈఓ పార్థసారధి హాజరయ్యారు. భక్తులకు దాతలతో కలసి వీరు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కె.సుబ్బరాజు, మాజీ ఎంపిటిసి సి.ఎం.కేశవులు (డాక్యుమెంట్ రైటర్ బుజ్జి), అర్చకులు శ్రావణ్ స్వామి, మోహన్ స్వామి, భక్తులు పాల్గొన్నారు.

## రేపు బడుగు బలహీన వర్గాల ఐక్యవేదిక

ఆధ్వర్యంలో 'ఆత్మీయ సమ్మేళన సభ'.. -ఆహ్వాన కమిటీ చైర్మన్ నాగరాజు గౌడ్ పిలుపు

తిరుపతి ప్రెస్‌క్లబ్,జూన్ 10 ప్రభాతవార్త:

రేపటి రోజు 12వ తేదీ సోమవారం మద్యాహ్నం 3 గంటలకు పుంగనూరు లోని ఆర్‌ఆర్ కళ్యాణమండపం నందు బడుగు బలహీన వర్గాలైన ఎస్సీ,ఎస్టీ, బిసి,క్రిస్టియన్,మైనారిటీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో 'ఆత్మీయ సమ్మేళన సభ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన కమిటీ చైర్మన్ నాగరాజు గౌడ్ తెలిపారు.ఈ మేరకు శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్ నందు కార్యక్రమం తాలూకు ఆహ్వాన పత్రికలను కమిటీ సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా విద్యుత్ శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి,సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డా॥మేరుగ నాగార్జున,డిప్యూటీ సిఎంలు కె.నారాయణస్వామి,రాజన్న దొర,మంత్రులు దొర,చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ,జోగి రమేష్,ముఖ్య అతిథులుగా చిత్తూరు ఎంపి రెడ్డెప్ప,తిరుపతి ఎంపి గురుమూర్తి,ఎమ్మెల్యేలు ఆదిమూలం సురేష్,ఎంఎస్.బాబు,ఖేలే అనిల్‌కుమార్,తదితరులు పాల్గొంటారని ఆయన వివరించారు.కావున తిరుపతి-చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ,ఎస్టీ,బిసి,క్రిస్టియన్,మైనారిటీ జేఏసి సభ్యులు హాజరయ్యి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సీతారాం,వర్మ,వాసుకుమార్ గౌడ్,మోహన్,తదితరులు పాల్గొన్నారు.



## 25న కరణీగర్ అభ్యుదయ సంఘం సమావేశం

-విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందచేత -సంఘం కార్యదర్శి సి.రమణన్ వెల్లడి

తిరుపతి ప్రెస్‌క్లబ్,జూన్ 10 ప్రభాతవార్త:



ఈనెల 25వ తేదీ ఆదివారం ఉద యం 11 గంటలకు స్థానిక చెన్నా రెడ్డి కాలనీలోని వెంకట రమణ టవర్స్ నందు తిరుపతి కరణీగర్ అభ్యు దయ సంఘం 24వ వార్షిక సర్వసభ్య సమావేశం జరపను న్నట్లు సంఘం కార్యదర్శి సి.రమ ణన్ తెలిపారు.శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా సర్వ సభ్య సమావేశాన్ని పురస్కరించుకుని ఉన్నత చదువులు చదువుతున్న చిత్తూరు,తిరుపతి జిల్లాలకు చెందిన కరణం/కరణీగర్ కులానికి చెందిన విద్యార్థులు నగదు ప్రోత్సాహక బహుమతులకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఎంబిబిఎస్, బిడిఎస్,అగ్రికల్చర్,బిఎస్సీ,బిటెక్,వెటర్నరీ కోర్సులు చేస్తున్నవారు అర్హులన్నారు.దీని కోసం ఈనెల 20 లోపు పూర్తి చేసిన దరఖాస్తులను ప్రొఫెసర్ వి.శ్రీధర్,డోర్ నెం:20-3-15 హెచ్/సి,శివజ్యోతినగర్, తిరుపతి అనే అడ్రెస్‌కు పంపాలన్నారు.25వ తేదీ జరిగే సర్వ సభ్య సమావేశంలో వీరికి నగదు ప్రోత్సాహక బహుమతులు అందచేస్తామన్నారు.అదేవిధంగా కార్యక్రమంలో భాగంగా అవివాహితులైన యువతీ యువకులకు 'వివాహ పరిచయ వేదిక' కార్యక్రమం కూడా నిర్వహిస్తామన్నారు.ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు సోమసుందర్ పిళ్లై,గుణశేఖర్, తులసీరాం పిళ్లై,రవికుమార్ పాల్గొన్నారు.

## మొబైల్ ఫోన్లకు బానిసలు కావద్దు..!

జిల్లా గ్రంథాలయ చైర్మన్ నైనార మధుబాల



చంద్రగిరి, జూన్ 10 ప్రభాతవార్త:

మొబైల్ ఫోన్లకు బానిసలు కావద్దని జిల్లా గ్రంథాలయ చైర్మన్ నైనార్ మధుబాల విద్యా ర్థులకు హితవు పలికారు. స్థానిక పాతపేట లోని గ్రంథాలయంలో శనివారం జరిగిన ఉచిత వేసవి శిక్షణా శిబిరం ముగింపు కార్యక్ర మానికి ఆమె ముఖ్యఅతిధిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటితరం పిల్లలు ఉత్తమ భావిభారత పౌరులుగా ఎదగా లని ఆకాంక్షించారు. విద్య మీ జీవితాలను ఉన్నత శిఖరాలకు చేర్చగలదన్నారు. గ్రంథాలయంలోని పుస్తక పఠనం ఉజ్వలమైన భవిష్యత్తుకు దోహదపడగలదన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో మన గ్రంథాలయాలు ముఖ్యపాత్ర పోషించిన విషయాన్ని గుర్తు చేశారు. శిక్షణ శిబిరంలో వివిధ అంశాలపై నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఆమె ప్రోత్సాహక బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఏ.రెడ్డెమ్మ, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై "శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు"



చంద్రగిరి, జూన్ 10 ప్రభాతవార్త:

శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆల యంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చా రు. సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు దేవేరులతో తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ తేనెపల్లి నర్రా మునిచెంగల్రాయులు, శ్రీశైలం ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ లవన్న, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, రవిచంద్రన్, డాక్టర్ లక్ష్మీ రాజేష్, పరిచారిక డాక్టర్ ఉదయ్‌తేజ, జమేదర్ జలంధర్, సిబ్బంది పాల్గొన్నారు.

